క్లుప్తంగా

బేతపూడిలో పశువులకు గాలికుంటు టీకా

ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకా గురువారం వేసినట్లు పశు వైద్యాధికారి పీర్ అహ్మద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తలో భాగంగా టీకా ఆయా గ్రామాల్లోని పశు వైద్య సిబ్బంది వేస్తున్నారని చెప్పారు. వ్యాధి నివారణ జాగ్రత్తలు, టీకా ఉపయోగాలను పాడి రైతులకు ఆయన వివరించారు. అనంతరం 150 గేదెలు, 5 ఎడ్లకు టీకా వేసినట్లు వెల్లడించారు. ఆయన వెంట పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కుల పంపిణీ

మంగళగిరి టౌన్: సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన నగదు చెక్కులను గురువారం పలువురు బాధితులకు టీడీపీ నాయకులు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న మంగళగిరి పట్టణంలోని 6వ వార్డుకు చెందిన ఆకులూరి ప్రసన్నకుమార్‌కు రూ.8,41,988, 15వ వార్డుకు చెందిన మంచాల శ్యామ్‌సుందర్‌కు రూ.50,891, 12వ వార్డుకు చెందిన మొహమ్మద్ సాధిక్‌కు రూ.20,541, 9వ వార్డుకు చెందిన గంజి లీలకు రూ.1,00,290ల నగదు చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

తక్కువ శ్రమతో ఆదాయాన్ని పొందండి

తాడేపల్లిరూరల్ : తక్కువ శ్రమతో అధిక ఆదాయాన్ని పొందవచ్చని ఖాదీ గ్రామీణ పరిశ్రమల రాష్ట్ర సంచాలకులు డాక్టర్ ఎస్. గ్రీస్ అన్నారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని నులకపేటలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీస్ మాట్లాడుతూ గ్రామ ఉద్యోగ వికాస్ యోజన ద్వారా తక్కువ శ్రమతో అధిక ఆదాయం పొందవచ్చని, వ్యవసాయ ఆధారిత ఆహార పరిశ్రమలు (ఆగ్రో బెస్ట్‌ఫుడ్ ఇండస్ట్రీస్) ద్వారా సాధ్యమని వివరించారు. టూల్స్ ఎక్విప్‌మెంట్ ద్వారా బహుళ ప్రయోజనం చేకూరుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ వివిధ విభాగాల అధికారులు, రమేష్, ఆనందకుమార్, మూర్తి, టివి రావు, విజయరాయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

దుగ్గిరాల: జీవ ఎరువులు వాడటం వల్ల రైతుకు అధిక లాభాలు వస్తాయని జిల్లా కో–ఆర్డినేటర్ సునీత అన్నారు. దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు చేరువ అవ్వాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది ఏఈవో శిరీష, వీఏఏలు, డీఆర్‌డీఏ, ఏపీఎం, సీసీలు, ఆరు గ్రామాల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్(ఎంటీఎంసీ)లో విలీన గ్రామాల్లోని సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విలీన గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో వచ్చిన సమస్యలను పరిష్కరించాలంటూ ఈ నెల 25న ఎంటీఎంసీ కార్యాలయంతో పాటు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఆత్మకూరు దళితవాడకు రెండు మూడు రోజులకు ఒక అరగంట మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందని ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చలేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు డి.నరసింహారావు, మొసలి ఫకీరయ్య, ఉద్దంటి దుర్గారావు, జి.అజయ్, వల్లూరి భారతి పాల్గొన్నారు.

కాలువలో పడిన ఆవు.. రక్షించిన స్థానికులు



మంగళగిరి టౌన్ : కాలువలో ఇరుక్కుపోయి ఇబ్బందిపడుతున్న ఆవును స్థానికులు మున్సిపల్ సిబ్బందితో కలసి రక్షించిన ఘటన మంగళగిరి పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. మంగళగిరిలోని పాత మంగళగిరి బోసుబొమ్మ సెంటర్ వద్ద ఒక ఆవు ప్రమాదశాత్తు కాలువలో పడిపోయింది. స్థానికులు మున్సిపల్ వర్కర్లకు సమాచారం ఇచ్చి, వారితో కలసి రెండు గంటలకు పైగా శ్రమించి ఆవును కాలువ లోంచి బయటకు తీసి కాపాడారు. మూగజీవిని కాపాడినందుకు స్థానికులు మున్సిపల్ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

తల్లిదండ్రులే నడిపించాలి

- మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు
- మంగళగిరిలో పెరిగిన త్రిపుల్ రైడింగ్
- రూల్స్ వయోలేట్ చేస్తున్న టీనేజర్లు
- అరకొరగా తనిఖీలు చేస్తున్న పోలీసులు
- పిల్లల తప్పిదం..పెద్దలకు తప్పదు జరిమానా

మంగళగిరి టౌన్: టీనేజర్లు ట్రాఫిక రూల్స్ వయోలేట్ చేస్తున్నారు. రయ్.. రయ్ అంటూ త్రిపుల్ రైడింగ్‌లో దూసుకుపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే మంగళగిరి నగర పరిధిలో ఇలాంటి దృశ్యాలు సాధరణమైపోయాయి. ఇందులో అధికంగా మైనర్లు ఉండటం ఆందోళన కలిగించే అంశం. వీరికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండదు. నిబంధనలు తెలియవు. రాంగ్ రూట్‌లో ప్రయాణం వారికో సరదా. బాలురే కాదు..బాలికలు కూడా రోడ్లపై దూసుకుపోతున్నారు. దీంతో తమకే కాకుండా ఎదుటవారికి ప్రమాదాన్ని పంచుతున్నారు. నిండా 18 ఏళ్లు నిండని టీనేజర్లు తమ ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడపడంలో థ్రిల్ అవుతున్నారు. ముందు వెళ్తున్న వాహనాలను ఓవర్ టేక్ చేసే ప్రమాదాల బారినపడుతున్నారు.



మంగళగిరి కోనేరు రోడ్డు వద్ద ఒకే వాహనంపై వెళ్తున్న నలుగురు

అదుపు చేయలేక..

వాహనాలను ఓవర్ టేక్ చేసే క్రమంలోనే టీనేజర్లు అధికంగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఒక్కోసారి ద్విచక్ర వాహనాలను ఆపలేని పరిస్థితుల్లో కాళ్లు కూడా కిందకు అందకపోవడంతో పడిపోతున్నారు. మంగళగిరికి చెందిన మైనర్ బాలురు రెండు నెలల క్రితం స్థానిక గౌతమ బుద్ధ రోడ్డులో స్కూటీపై వెళ్తున్నారు. ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో గాయాలు అయ్యాయి. నగరంలోని పలు ప్రాంతాలు, కూడళ్లలో నిత్యం పోలీసులు విధులు నిర్వహిస్తుంటారు. వీరి ముందు నుంచే మైనర్లు డ్రైవింగ్ చేసుకుంటూ వెళుతుంటారు. అరకొర తప్ప మైనర్లకు పోలీసు అధికారులు పెద్దగా కౌన్సెలింగ్ ఇస్తున్న సందర్భాలు కనిపించడం లేదు.

అతి గారాబంతో అనర్థం

తల్లిదండ్రులు తమ పిల్లలను అతి గారాబం చేస్తూ బైక్ అడిగిన తక్షణమే కీస్ ఇచ్చేస్తున్నారు. మరికొందరు తండ్రి బైక్‌పై వెనుక కూర్చొని తమ పిల్లలతో వాహనాలు నడిపిస్తున్నారు. ఒక్కోసారి ఇంట్లో చెప్పకుండా పిల్లలు వాహనాలు తీసుకుని స్నేహితులతో బయటకు వెళ్లిపోతున్నారు. ఆ సమయంలో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. బైక్‌ను నియంత్రించే సామర్థ్యం లేకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొట్టడం, నేరుగా బైక్‌లను ఢీకొనడం వంటి ప్రమాదాలు జరిగిన ఘటనలు మంగళగిరి కోకొల్లలు.



మంగళగిరి గౌతమ బుద్ధ రోడ్డుపై మైనర్ల త్రిపుల్ రైడింగ్



మంగళగిరి పాతబస్టాండ్ వద్ద ఒకే వాహనంపై వెళ్తున్న ముగ్గురు యువతులు

మైనర్లకు వాహనాలు ఇస్తే జరిమానా

మైనర్లు వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడితే జరిమానా విధిస్తారు. ఇటీవల నూతన చట్టం అమల్లోకి రావడంతో 304 పార్ట్ 2 కింద మైనర్లు వాహనం నడిపినపుడు ప్రమాదం జరిగి అవతల వ్యక్తి మరణిస్తే వాహన యజమాని, మైనర్‌తో పాటు తల్లిదండ్రులు కూడా శిక్షకు గురి అవుతారు. మోటారు వాహన చట్టం 199ఏ ప్రకారం మైనర్ తల్లిదండ్రులు, వాహన యజమానులకు గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. రూ.25 వేల వరకు జరిమానా విధించవచ్చు. ఏడాది పాటు సదరు వాహనం రిజిస్ట్రేషన్ రద్దు చేయడం, మైనర్‌కు 25 సంవత్సరాలు వచ్చే వరకు లైసెన్స్ జారీ చేయకపోవడం చేస్తారు. మైనర్లు వాహనం నడిపేటప్పుడు పట్టుబడితే ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తాం



మైనర్లకు ద్విచక్ర వాహనం ఇవ్వకూడదని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. తరచు నాకా బందీ నిర్వహించి, జరిమానా విధిస్తున్నాం. పిల్లలకు వాహనాలు ఇవ్వడంపై తల్లిదండ్రులు ఆలోచించాలి. ఒక్కోసారి ప్రమాదాలు జరిగి కుటుంబాలు తేరుకోని విధంగా నష్టం కలగవచ్చు. మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టపరంగా తీసుకోబోయే చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– డి.వినోద్ కుమార్, సీఐ, మంగళగిరి పట్టణం

ఖాళీ స్థలాల యజమానులకు కమిషనర్ హెచ్చరిక

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాల్లో చెత్త వేయడం, చెత్త పేరుకుపోవడం, చెట్లు, పిచ్చిమొక్కలు పెరగడంతో దోమలకు, పందులకు ఆవాసాలు అవుతున్నాయని, వెంటనే యజమానులు శుభ్రం చేసుకోవాలని, లేకపోతే జరిమానా విధిస్తామని గురువారం ఒక ప్రకటనలో కమిషనర్ హెచ్చరికలు జారీ చేశారు. నగరంలో పలుచోట్ల ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు, కలుపు మొక్కలతో నిండి ఉన్నాయని, తద్వారా ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే దోమలు, పందులకు నిలయంగా మారుతున్నాయన్నారు. వీటివల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, వెంటనే ఖాళీ స్థలాల యజమానులు వీలైనంత త్వరగా తమ స్థలాలను శుభ్రం చేసి స్వచ్ఛ మంగళగిరికి సహకరించాలని కోరారు. మొదటి దశలో ఖాళీ స్థలాల యజమానులను సంప్రదించి ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచుకోమని తెలియజేస్తామని, అలా చేయపోతే నోటీసులు అందజేస్తామన్నారు. అప్పటికీ యజమానులు స్పందించకపోతే భారీ జరిమానాలు విధిస్తామని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు మనోహర పండుగ

ఫిరంగిపురం: మండలంలోని గరుడాచల పాలెంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు క్రైస్తవ ఆరాధన మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మనోహర పండుగ నిర్వహించనున్నట్లు పాస్టర్ కె.జాన్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాక్యోపదేశకులుగా పాస్టర్ కె.నెహేమ్యా, పాస్టర్ రమేష్, పాస్టర్ దియ్యా ప్రసాద్ హాజరవుతారని పేర్కొన్నారు.

పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలి

వైఎస్సార్‌సీపీ సనమ్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి: మండలంలోని కురగల్లు, నీరుకొండ గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రాత్రి వేమారెడ్డి కురగల్లు, నీరుకొండ గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ పార్టీలో ప్రతి కార్యకర్తను కలుపుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఏవైనా చిన్నపాటి అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గతంలో ఉన్న విబేధాలతో ఐక్యతగా లేకపోతే పార్టీలో ఐక్యత దెబ్బతింటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు అన్ని గతం మరచి పార్టీ విజయం కొరకు ఇప్పటి నుంచి నిరంతరం కృషి చేయాలన్నారు. చంద్రబాబు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి నేడు ప్రజలకు ఒక్క హామి నెరవేర్చలేక అబద్దాలతో కాలం వెలిబుచుతున్నారన్నారు. హామీలు నెరవేరకపోవడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు జనంలోకి వెళ్లేందుకు భయపడుతున్నారు. చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేసి మళ్లీ 2029లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు నాలి వెంకట కృష్ణ, సీనియర్ నాయకులు బొమ్మ సాంబిరెడ్డి. తాడిబోయిన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



గ్రామ పార్టీ నాయకులతో వేమారెడ్డి

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

తాడికొండ: వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయం గూగుల్ క్లౌడ్ సహకారంతో 12 గంటల గూగుల్ డెవస్, 2 కే 25 హెకథాన్ గురువారం నిర్వహించారు. ఈవెంట్‌ను గూగుల్ క్లౌడ్ డిజిటల్ క్యాంపస్ 2.0లో భాగంగా వీఐటీఏపీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహించినట్లు వర్సిటీ వీసీ ఎస్.సి.కోటారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూగుల్ క్లౌడ్ దక్షిణ ప్రాంతీయ అధిపతి సిద్ధార్థ్ దళ్వాడి హాజరయ్యారు. వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్.సి.కోటారెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఖ్యాతి పెంచడంలో అంతర్జాతీయ సహకారాలు, అవగాహన ఒప్పందాల ప్రాముఖ్యత యువ వ్యవస్థాపకులకు అందించే నిధుల మద్దతు తెలియజేశారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్‌చంద్ర ముదికంటి మాట్లాడుతూ విద్యార్థులు సమయ నిర్వహణ సవాళ్లకు ఆటోమ్యాషన్ పరిష్కారాలు అన్వేషించాలని తెలిపారు. హెకథాన్‌లో 350 జట్లు నమోదు చేసుకోగా, 160 ఎలిమినేషన్ రౌండ్ తరువాత పాల్గొనడానికి ఎంపిక చేయబడ్డాయి. మొదటి మూడు జట్లను విజేతలుగా ప్రకటించారు. కన్వీనర్ డాక్టర్ దీపశిఖ మిత్ర, డాక్టర్ సుధాకర్ ఇళంగో, డాక్టర్ సరోజ్ ప్రాణీగ్రహి, డాక్టర్ ఖాదీర్‌బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిద్దార్థ్ దళ్వాడి

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

మేడికొండూరు: మండల కేంద్రంలో సీపీఎం ప్రజా చైతన్య ప్రచార యాత్ర గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలుదారులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి దుర్గం వీర ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారినా కౌలు రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం గుంటూరు జిల్లా కమిటీ సభ్యుడు కె.అజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాలలో కౌలు రైతుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. భూ యజమాని సంతకమనే షరతు ఉండటం వల్ల కౌలు గుర్తింపు కార్డులు రాలేదన్నారు. సీనియర్ సీపీఎం నాయకుడు బొట్ల రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో కౌలు గుర్తింపు కార్డులే పెద్ద సమస్యగా మారిందన్నారు. కౌలుదారు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంలో జాప్యం చేస్తే కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యదర్శి ఎస్ఎం బాష, ఎన్.చిలకయ్య, డి.వెంకటేశ్వర్లు, వి.లక్ష్మీనారాయణ, ఇమామ్ షరీఫ్ పాల్గొన్నారు.

పెనుమాక రైతులకు 1,352 రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు

తాడికొండ: రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక గ్రామానికి చెందిన 510 మంది రైతులకు గురువారం విజయవాడలోని ఏపీ సీఆర్డీఏ కార్యాలయంలో 1,352 ప్లాట్లను కేటాయించారు. వీటిలో 787 నివాస ప్లాట్లు కాగా, 565 వాణిజ్య ప్లాట్లు విధానంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా సీఆర్డీఏ అధికారులు రైతులకు కేటాయించారు. లాటరీకి హాజరైన రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రయల్ రన్ వేసిన అనంతరం ప్రత్యక్ష లాటరీ ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. రైతుల సహకారంతోనే ప్రపంచ స్థాయిలో రాజధాని అమరావతి నిర్మాణం జరుగుతుందని ఏపీ సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు స్పష్టం చేశారు. అదనపు కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలన్నారు. ఎల్పీఎస్ భూముల్లో అభివృద్ధి పనులు మొదలవుతున్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆలస్యం కాకుండా కొత్తగా 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలు ప్రారంభించిన విషయం రైతులకు గుర్తు చేశారు. ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించడానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ వల్లభనేని శ్రీనివాసరావు, సీఆర్డీఏ ల్యాండ్స్ విభాగం జాయింట్ డైరెక్టర్ వి డేవిడ్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎజీ చిన్ని కృష్ణ, వసంత రాయుడు, ప్రిన్సిపల్ ప్లానర్ ఆర్.నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్ట్ నిర్మాణ పనులు ప్రారంభం

దుగ్గిరాల: దళితవాడలోకి వెళ్లేందుకు మురుగు కాల్వపై ఉన్న కల్వర్ట్ నిర్మాణ పనులను చిలువూరు గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ గురువారం ప్రారంభించారు. చిలువూరు దళితవాడలోకి వెళ్లే మురుగు కాల్వ కల్వర్టు కోసం మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చొరవతో ఎంపీ అయోధ్య రామిరెడ్డి ఎంపీ నిధులు నుంచి రూ.42,80,000 గ్రాంట్‌ను గతేడాది మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాణిక్యం, ఎంపీపీ జాన్‌బీ, ఎంపీటీసీ సభ్యురాలు మరియ రోజమ్మ, ఆర్‌సీఎం ఫాదర్ రెవరెండ్ సురేష్‌పాల్, తిరుపతి యోహోషూవా పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యురాలు, నాయకులు

కోర్టు తీర్పులను అమలు చేయాలి

తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని యూనియన్ నాయకులు కె.ఆదినారాయణతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే కార్మికుల సమస్య పరిష్కారం కావడం లేదని విమర్శించారు. కోర్టు తీర్పులను సైతం యాజమాన్యం ధిక్కరిస్తోందని, ప్రభుత్వం వెంటనే కార్మికుల విషయంలో జోక్యం చేసుకుని వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ ఈ కార్యక్రమంలో గురవయ్య, ఇమాంబి, ఆశీర్వాదం, రమాదేవి, శివమ్మ, యహోషువా, అంకయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత యోగ శిక్షణ

మంగళగిరి టౌన్ : మంగళగిరి నగర పరిధిలోని శ్రీ లక్ష్మీ నారాయణస్వామి దేవస్థా ఆవరణలో శ్రీ రాధాకృష్ణ యోగ సేవ కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత యోగ శిక్షణ ప్రారంభమవుతుందని కేంద్ర వ్యవస్థాపకులు రాధాకృష్ణ యోగి గురువారం తెలిపారు. మూడు వారాల పాటు జరిగే ఈ శిక్షణ శిబిరంలో యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 72 రకాల దీర్ఘకాలిక వ్యాధులు యోగా చేయడం ద్వారా మటుమాయం అవుతాయన్నారు. ఉదయం 6 నుంచి 7.30 వరకు యోగ శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని నగర, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మేడికొండూరు : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ నాగూర్ మీరా సాహెబ్ వివరాల మేరకు.. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం పాడపాడు గ్రామానికి చెందిన మంత్రి విద్యాసాగర్ (33) సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం సిరిపురం గ్రామ పంచాయతీ అధికారులు గ్రామంలోని చెరువులో ఉన్న బావి వద్దకు వెళ్లి చూడక గుర్తు తెలియని మృతదేహం తేలియాడుతూ కనిపించింది. వెంటనే మేడికొండూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోమవారం పనికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి విద్యాసాగర్ వెళ్లాడని మృతుడి సోదరుడు శ్రీకాంత్ పోలీసులకు తెలిపాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

మరోసారి మాట తప్పిన ముఖ్యమంత్రి



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని సీపీఎం కార్యాలయంలో విద్యుత్ చార్జీల పెంపుపై ఆ పార్టీ ప్రచురించిన పుస్తకాన్ని గురువారం ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. సీపీఎం నాయకులు కట్టి కరుణాకరరావు మాట్లాడుతూ గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ చార్జీలు పెంచారంటూ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు బాదుడే బాదుడు కార్యక్రమం అప్పట్లో నిర్వహించాని గుర్తుచేశారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీల భారం మోపమని చెప్పి అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన ప్రజలకు ఇచ్చిన మాట తప్పి ఈ విధంగా చేయడం చాలా ఆశ్చర్యంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో 18 వందల కోట్ల విద్యుత్ ఒప్పందంలో అవినీతి జరిగితే, టీడీపీ ప్రభుత్వం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ట్రూ అప్, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుబ్బారెడ్డి, డి. కోదండ రామయ్య పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సీఎస్ఈ హానర్స్, ఫార్మసీ కళాశాల వలంటీర్లు చిర్రావూరు గ్రామంలో క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ పోషకాహార లోపంతో క్షయవ్యాధి సోకే ప్రమాదం ఉందని తెలిపారు. వలంటీర్లు క్షయవ్యాధి వ్యాపి, చికిత్స విధానం, నివారణ మార్గాలను ఇంటింటికి తిరిగి వివరించారని చెప్పారు. డాట్స్ చికిత్స విధానంతో మందులు సరిగా తీసుకుంటే ఆరు నెలల్లో వ్యాధిని తగ్గించవచ్చని వివరించారు. ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. సుప్రియ, విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు. అధ్యాపక బృందం వారిని అభినందించారు.

చర్మ సంరక్షణపై అవగాహన సదస్సు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో గురువారం చర్మ సరంక్షణపై ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రముఖ చర్మ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ మనస్విత విచ్చేసి, మాట్లాడారు. వేసవిలో ఎండల గడిపే సమయం పరిమితం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ వీడీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్, ఉమెన్ డెవలప్‌మెంట్ కన్వీనర్ డాక్టర్ కె.రూతు రమ్య పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ మనస్విత

విజయవాడ నుంచే హజ్ యాత్ర కొనసాగించాలి

దుగ్గిరాల: పవిత్ర హజ్ యాత్రకు విజయవాడ నుంచే హజ్ యాత్రను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. దుగ్గిరాల ముర్తజానగర్ లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో హజ్ యాత్రకు వెళ్లేందుకు రాష్ట్రంలోని ముస్లింలు హైదరాబాద్, బెంగళూరు చేరుకోని ఎన్నో వ్యయ ప్రయాసలు పడాల్సి వచ్చేదన్నారు. ఆ విషయాన్ని అప్పటి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి ముస్లిం పెద్దలు తీసుకెళ్లారని గుర్తుచేశారు. స్పందించిన ఆయన హజ్ యాత్రికుల సౌలభ్యం కొసం 2023 విజయవాడలో విమానాశ్రయం నుంచి ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు చేసి హజ్ యాత్రకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. టిక్కెట్టు ధర పెరగటం వల్ల ఒక్కో హజ్ యాత్రికునికి రూ.83 వేలు అదనపు భారం పడుతోందని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భరించి హజ్ యాత్రికులకు ఆర్థికంగా అండగా నిలబడిందన్నారు.ప్రస్తుతం హజ్ కోసం విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి విజవయవాడ ఎంబార్కేషన్ పాయింట్ కొనసాగంచాలని డిమాండ్ చేశారు. యాత్రికులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేసి, అండగా నిలవాలని కోరారు. మైనార్టీ నేతలు షేక్ జాను సాహెబ్, షేక్ సమీ ఉల్లా పాల్గొన్నారు.



సమావేశం లో మాట్లాడుతున్న షేక్ సుభాని

జిల్లా పరిషత్ స్థలాల పరిశీలన

మేడికొండూరు: మండల పరిధిలోని పేరేచర్ల కైలాసగిరి కొండ పక్కనే ఉన్న జిల్లా పరిషత్తు స్థలాలను గుర్తుతెలియని వ్యక్తులు ఆక్రమించుకున్నారు. సర్వే నెంబర్ల వివరాలను మార్చి కొనుగోలు దారులకు కబ్జాదారులు విక్రయానికి సిద్ధంగా ఉంచారు. గురువారం ఆ స్థలాల వద్ద పిచ్చి చెట్లను తొలగిస్తుండగా సమాచారం తెలుసుకున్న మేడికొండూరు జిల్లా పరిషత్ సభ్యులు కందుల సిద్దయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో పాటిబండ్ల పూర్ణ శంకరరావు, రెవెన్యూ అధికారులు స్థలాల వద్దకు వెళ్లి అధికారులు పరిశీలించారు. కైలాసగిరి సర్వే నంబరు 581లోని 63 ఎకరాల 63సెంట్లు జిల్లా పరిషత్ స్థలం ఉంది. కైలాసగిరి కొండ పక్కనే నాలుగు సెంట్లు, ఆరు సెంట్లు చొప్పున ఆక్రమణదారులు కబ్జా చేశారు. ఈ స్థలాలు జిల్లా పరిషత్తు స్థలంలోని సర్వే నెంబరు 581 లోని స్థలాలుగా రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు హద్దు రాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శంకరరావు తెలిపారు.



జెడ్పీ స్థలాలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు సిద్ధయ్య, ఎంపీడీవో పూర్ణ శంకరరావు